## క్లుప్తంగా

### విద్యార్థుల శ్రమదానం



భూమానందాశ్రమం వద్ద పారిశుధ్య కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

**చక్రాయపేట :** వారం రోజుల ప్రత్యేక క్యాంపులో భాగంగా ట్రిపుల్ఐటీకి చెందిన యూనిట్–9 ఎన్ఎస్ఎస్ విద్యార్థులచే పారిశుధ్య కార్యక్రమం చేపట్టినట్లు ప్రోగ్రాం అధికారిణి దీప్తి తెలిపారు. గండి భూమానందాశ్రమం పరిసరాలతోపాటు మారుతీనగర్ గండిక్షేత్రంలో వివిధ కార్యక్రమాలు చేపడతామని ఆమె తెలిపారు.

### ఎన్ఎంఎంఎస్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

**సింహాద్రిపురం :** ఎన్ఎంఎంఎస్ పరీక్షలో మండల వ్యాప్తంగా 11 మంది విద్యార్థులు ప్రతిభ చూపగా.. అందులో మండల పరిధిలోని కోవరంగుంటపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తరుణ్, వీణ, లాస్యలు ప్రతిభ చూపినట్లు హెడ్మాస్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. గతనెల పులివెందుల నియోజకవర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పరీక్ష నిర్వహించారన్నారు. ఒక్కొక్క విద్యార్థికి ఏడాదికి రూ.12,500ల చొప్పున స్కాలర్ షిప్ వస్తుందన్నారు.

**వేముల :** జాతీయస్థాయిలో ఎన్ఎంఎంఎస్ పరీక్షలో వేముల మండలం నల్లచెరువుపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన రామిరెడ్డి ఝాన్సీ 125 మార్కులు సాధించి జిల్లాస్థాయిలో 8వ ర్యాంక్ సాధించినట్లు హెడ్మాస్టర్ ప్రసాద్ తెలిపారు.

### వారపు సంతకు వేలం పాట

**సింహాద్రిపురం :** స్థానిక గ్రామ పంచాయతీలో 2023–24 సంవత్సరానికి శనివారం వారపు సంతకు సర్పంచ్ రామ్మోహన్, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్రెడ్డి, మండల విస్తరణాధికారి అధ్యక్షతన వేలంపాట నిర్వహించారు. మోపూరి రామసుబ్బారెడ్డి రూ.4.05లక్షలకు వారపు సంతను దక్కించుకున్నాడు. గత ఏడాది రూ.3.63 లక్షల ఆదాయం వచ్చిందని వారు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరికిశోర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### కరపత్రాల విడుదల

**జమ్మలమడుగు రూరల్ :** ఏప్రిల్ 5వ తేదీన జరిగే చలో ఢిల్లీ కార్మిక, కర్షక పోరాట ప్రదర్శనను విజయవంతం చేయాలని సీఐటీయూ పట్టణ కమిటీ సభ్యులు దాసు, విజయ్లు శనివారం స్థానిక ఎన్జీఓ హోంలో కరపత్రాలను విడుదల చేశారు.

### మెడికలాఫీసర్కు అసిస్టెంట్ ప్రొఫెసర్గా పదోన్నతి

**పులివెందుల టౌన్ :** పులివెందుల రక్తనిధి మెడికలాఫీసర్గా విధులు నిర్వహిస్తున్న దివ్యశ్రీ నంద్యాల మెడికల్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్గా పదోన్నతి పొందింది. శనివారం ప్రభుత్వాసుపత్రిలో పదోన్నతి పొందిన దివ్యశ్రీని మెడికల్ సూపరింటెండెంట్ పవన్కుమార్రెడ్డి, డాక్టర్ హిమబిందులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రాజు, కాత్యాయిని, మహమ్మద్ రఫీ, హనుమకుమార్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్

**జమ్మలమడుగు రూరల్ :** ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. శనివారం పట్టణంలోని సబ్ జైల్ను ఆయన ఆకస్మిక తనిఖీ చేసి అనంతరం ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. తప్పు చేసి జైల్కు వచ్చినవారిలో మార్పు రావాలన్నారు. పేద ఖైదీలకు ఉచితంగా న్యాయ సహాయం చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ విష్ణువర్ధన్రెడ్డి, న్యాయవాదులు భూతమపురం సుబ్బారావు, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కరెంట్ తీగలు తగిలి గేదె మృతి

**పెద్దముడియం :** మండల పరిధిలోని ఎస్.కొట్టాలపల్లె గ్రామ సమీపాన కరెంట్ తీగలు తగిలి గేదె మృతి చెందింది. పెద్దపసుపుల గ్రామానికి చెందిన వంగల సుబ్బలక్షుమ్మ అనే మహిళ మేత కోసం శనివారం పశువులను పొలానికి తీసుకెళ్లింది. నీరు తాగడానికి వెళ్లిన గేదెకు కరెంట్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందిందని యజమాని సుబ్బలక్షుమ్మ తెలిపారు.

గేదె విలువ సూమారు రూ.70 వేలు ఉంటుందని ఆమె పేర్కొన్నారు. కరెంట్ తీగలు చాలా తక్కువ ఎత్తులో ఉన్నాయని పొలానికి వెళ్లే రైతులు అక్కడికి నీరు తాగడానికి వెళుతుంటారని, వారికి ఎలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరారు.

## కూలీల వలసలకు చెక్..
# సొంత ఊర్లోనే ఉపాధి

- మండలంలో 5,053 మంది కూలీలకు ఉపాధి పనులు
- పని దినాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

**ఎర్రగుంట్ల :** ఉపాధి హామీ పథకంతో కూలీలకు ఉన్న ఊర్లోనే జీవనోపాధి కల్పించే కార్యక్రమంను సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రభుత్వంలో సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించడంతో పాటు వేతనాలను ఎప్పటికప్పుడు కూలీల ఖాతాలకు జమ చేస్తోంది.

**స్పీడ్ అందుకున్న ఉపాధి పనులు**

మండలంలో వ్యవసాయ పనులు జోరు తగ్గి వేసవి ఆరంభం కావడంతో కూలీలు ఉపాధి పనుల్లో ఎక్కువగా పాల్గొంటున్నారు. ఈ క్రమంలో 2023–24 సంవత్సరానికి సంబంధించి మండలంలో 65 వేల పనిదినాలు కల్పించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. మండల పరిధిలో 6170 జాబ్ కార్డులు ఉండగా ఇందులో 5053 మంది కూలీలు పనులు చేస్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా నీటి వనరులు, వాగులు, చెరువుల ఆధునికీరణ, పంట పొలాల చుట్టూ సరిహద్దులు, అంతర్గతంగా కందకాలు, ఇంకుడు గుంతలు, వంటి తవ్వకం పనులు చేపడుతున్నారు. జగనన్న పచ్చతోరణం పథకంలో భాగంగా రాహదారులకు ఇరువైపులా ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ ప్రదేశాలు, చెరువు గట్లపైన మొక్కలు నాటే పనులు చేపడుతున్నారు. రైతుల పోలాల్లో ఉద్యాన, పండ్ల తోటల సాగును ప్రోత్సహించడానికి పనులు కేటాయిస్తారు. వంద రోజులు పని కల్పించి రోజుకు రూ.250 చొప్పున కూలీ సొమ్ము లభించేలా ప్రణాళికలు రూపొందించారు.

**అడిగిన వారందరికీ ఉపాధి**



ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీల వలసలను నివారించాలన్న ప్రధాన ఉద్దేశ్యంతో ఇప్పటికే అన్ని గ్రామాలలో పనులు గుర్తించాం. గ్రామాల్లో అడిగిన కూలీలందరికీ పనులు కల్పిస్తున్నాం.

– నాగసులోచన (ఉపాధి ఏపీఓ, ఎర్రగుంట్ల)

## సాదాసీదాగా మున్సిపల్ బడ్జెట్ సమావేశం



మాట్లాడుతున్న కమిషనర్ పి.జగన్నాథ్

**ఎర్రగుంట్ల :** 2023–24 సంవత్సరానికి సంబంధించి ఎర్రగుంట్ల మున్సిపల్ బడ్జెట్ సమావేశం శనివారం మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్రెడ్డి అధ్యక్షతన సాదాసీదాగా జరిగింది. 2023–24 సంవత్సరానికి సంబంధించి రాబడి, జమ ఖర్చులు పోగా నిల్వ సుమారు పది కోట్లు దాక ఉన్నట్లు బడ్జెట్లో చూపించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు కో–ఆప్షన్ సభ్యులు మాట్లాడుతూ బడ్జెట్లో నిధులు ఉన్నట్లు చూపిస్తున్నారు.. మరి పనులు ఎందుకు చేయలేదంటూ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు ప్రశ్నించారు. వారి వార్డులలో ఉన్న సమస్యలను పరిష్కంచాలన్నారు. మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ మాట్లాడుతూ బడ్జెట్లో పొందుపరిచిన అంశాలను ప్రభుత్వానికి పంపిస్తే అక్కడ నుంచి నిధులు వస్తాయన్నారు. కౌన్సిలర్లు అడిగిన సమస్యలు పరిష్కరిస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ కౌన్సిలర్లు అడిగిన వెంటనే వార్డులలో పనులు చేయాలని మున్సిపల్ అధికారులకు ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు డి.సూర్యనారాయణరెడ్డి, మహమ్మద్ ఆలీ, ఎరికలరెడ్డి, భాస్కర్, నాగిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు జైబూన్నిసా, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్లో సమస్యల పరిష్కారం



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డి

**పులివెందుల :** పట్టణంలోని స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డి పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. పట్టణానికి చెందిన కొందరు మహిళలు గత ప్రభుత్వాల హయాంలో తమకు ఇళ్లు మంజూరైనట్లుగా ప్రభుత్వ రికార్డులలో చూపిస్తున్న కారణంగా తమకు ప్రస్తుత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరు కాలేదని.. అయితే తమకు గత ప్రభుత్వాలలో అసలు ఇళ్లే మంజూరు కాలేదన్నారు. దీనికి ఎంపీ స్పందించి హౌసింగ్ అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం ప్రజలనుంచి వచ్చిన తదితర సమస్యలను ఆయన పరిష్కరించారు.

**అండగా ఉంటాం..**

రెండు రోజుల క్రితం పట్టణంలోని ఎర్రగుడిపల్లెకు చెందిన గణేష్ అనే యువకుడు నీటి కుంటలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించాడు. క్యాంపు కార్యాలయంలో ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని విధాలుగా అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు.

## రాజోళి ప్రాజెక్టును పూర్తి సామర్థ్యంతో ఏర్పాటు చేయాలి

జలవనరులశాఖ అధికారితో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



జలవనరులశాఖ అధికారులతో మాట్లాడుతున్న రైతులు, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

**జమ్మలమడుగు :** కరువుతో అల్లాడిపోతున్న ప్రాంతంలో కుందూ నది ప్రతి సంవత్సరం లక్షల క్యూసెక్కుల నీటితో ప్రవహిస్తుంది. ఈ కుందూ నదిపై దివంగత నేత వైఎస్ రాజశేఖర్రెడ్డి రాజోళి వద్ద ప్రాజెక్టు ఏర్పాటుచేయడం కోసం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టును 2.95 టీఎంసీతో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి పెద్దముడియం రాజోళి ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలతో కలిసి విజయవాడలో జలవనరులశాఖ చీఫ్ ఇంజినీర్ నారాయణరెడ్డిని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజోళి ప్రాజెక్టు సామార్థ్యం తగ్గించి నిర్మాణాలు చేపడుతున్నారంటూ ప్రచారం జరుగుతుంది. కాని అధికారులు మాత్రం పూర్తి సామార్థ్యంతోనే ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నామని చెప్పినట్లు వివరించారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం టెండర్లు పిలవడంతో పాటు ముంపు గ్రామాలకు సంబంధించిన భూమి వివరాల సేకరణ అధికారులు ఇప్పటికే పూర్తి చేయించినట్లు జలవనరులశాఖ అధికారులు వివరించారన్నారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళితే ఆయన కూడా సానుకూలంగా స్పందించారని వివరించారు. ముంపువాసులకు పరిహారం విషయం కూడ పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వివరించినట్లు రామసుబ్బారెడ్డి తెలిపారు.

## భవన నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి

**ఎర్రగుంట్ల :** నగర పంచాయతీలో మున్సిపల్ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్రెడ్డి కోరారు. శనివారం మున్సిపల్ భవన నిర్మాణ పనులను ఆయన మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్రెడ్డితో కలసి పరిశీలించి మాట్లాడారు. పనులను తొందరగా పూర్తి చేసి, అలాగే భవనం ముందు దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్రెడ్డి విగ్రహంను ఏర్పాటు చేయడానికి అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్, మండల వైఎస్సార్ సీపీ ఇన్చార్జి సురేంద్రనాథ్రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్లు సిబ్బంది పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్రెడ్డి

### తమలపాకు రైతులను ఆదుకోవాలి

**వేంపల్లె :** మండలంలో దెబ్బతిన్న తమలపాకు, అరటి తోటల రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారెడ్డి, ఈశ్వరయ్యలు డిమాండ్ చేశారు. శనివారం మండలంలో దెబ్బతిన్న పంటలను వారు పరిశీలించి మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షానికి తమలపాకు, అరటి, బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయని.. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎకరానికి రూ.50వేల చొప్పున పంట నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి బ్రహ్మం, వేంపల్లె మండల కార్యదర్శి బాషా తదితరులు పాల్గొన్నారు.

### నేడు కిడ్నీ వైద్య నిపుణులు రాక

**పులివెందుల :** పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్ (గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ దినేష్కుమార్రెడ్డి రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. డాక్టర్ దినేష్కుమార్రెడ్డి కిడ్నీలో రాళ్లు, కిడ్నీ వాపు, కిడ్నీ గడ్డలు, కిడ్నీఅండ్ యూరిన్ ఇన్ఫెక్షన్, మూత్ర సమస్యలు తదితర జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునే వారు పగడపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

### ఫ్యాక్షన్ వల్ల కుటుంబాలు వీధిన పడతాయి

**జమ్మలమడుగు రూరల్ :** ఫ్యాక్షన్ వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని కేవలం వారి కుటుంబాలు రోడ్డు న పడతాయని జమ్మలమడుగు రూరల్ సీఐ టి.వి. కొండారెడ్డి తెలిపారు. శనివారం మైలవరం మండలంలోని దొడియం గ్రామంలో పోలీసు కళాజాగృతి బృందం పరివర్తన కార్యక్రమంలో భాగంగా 'మేలు కొలుపు' నాటకం ప్రదర్శించారు. అనంతరం రూరల్ సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాల వల్ల నష్టమే తప్ప లాభం ఉండదన్నారు. ఫ్యాక్షన్, క్రికెట్ బెట్టింగ్, మట్కా, గ్యాంబ్లింగ్ వల్ల కుటుంబాలు వీధిన పడతాయన్నారు. గ్రామాల్లో ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ కె.ఎస్.లత, ఎస్ఐ రామకృష్ణ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పరామర్శ

**కమలాపురం :** స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు కొర్రపాటి శరత్బాబును ఎమ్మెల్యే రవీంద్రనాథ్రెడ్డి పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న శరత్బాబును శనివారం ఆయన నివాసానికి చేరుకుని పరామర్శించారు. ఏ అవసరం ఉన్న తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే తెలిపారు.

## ఎన్ఎస్ఎస్ విద్యార్థుల స్పెషల్ క్యాంపు




పాఠశాల ఆవరణాన్ని పరిశుభ్రం చేస్తున్న విద్యార్థులు

**పులివెందుల టౌన్ :** పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వేముల మండలం వేల్పుల గ్రామంలో స్పెషల్ క్యాంపును ప్రారంభించినట్లు వైఎస్సార్సీపీ నాయకులు లింగాల రామలింగారెడ్డి తెలిపారు. లయోలా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ అమల్రాజ్ పర్యవేక్షణలో ఈనెల 31వ తేదీ వరకు ఈ క్యాంపు ఉంటుందన్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామంలో పరిసరాల పరిశుభ్రత, చెత్త చెదారాలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ ఆంటోని పాల్, ఎన్ఎస్ఎస్ అధికారి శంకరయ్య, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**వేంపల్లె :** పట్టణంలోని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం వేంపల్లె సమీపంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శిబిరం ఏర్పాటు చేశారని ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాఠశాల ఆవరణాన్ని శుభ్రం చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి మనం కర్తలు కావాలన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడంవల్ల సమాజ పురోభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుళరెడ్డి, పీడీ తేజేంద్ర, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## 800 సంఘాలకు వైఎస్సార్ ఆసరా విడుదల



నల్లింగాయపల్లె సచివాలయంలో సీఎం ప్రసంగాన్ని వీడియో ద్వారా తిలకిస్తున్న డ్వాక్రా మహిళలు

**కమలాపురం :** మండలంలోని 800 మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.6,53, 29,000 విడుదల అయినట్లు వెలుగు ఏపీఎం అపర్ణ తెలిపారు. శనివారం సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి అర్హులైన మహిళల ఖాతాలకు నగదు జమచేశారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ వరుసగా మూడవ సారి మండలంలోని 800 సంఘాల సభ్యులకు వైఎస్సార్ ఆసరా నిధులు విడుదల అయ్యాయన్నారు. ఈ నిధులతో మహిళలు వివిధ రకాల వృత్తి, వ్యాపారాలు చేసుకుంటూ తమ జీవనంలో మార్పులు సాధించారన్నారు. సీఎం ప్రసంగాన్ని అన్ని సచివాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వినిపించామన్నారు. కార్యక్రమంలో వెలుగు, ఆశాలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## వేలం పాటలో రూ.33లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న పంచాయతీ ఈఓ రవిశంకర్రెడ్డి

**వేంపల్లె :** పట్టణంలో సంత మార్కెట్కు సంబంధించి వేలంపాటలో పంచాయతీకి రూ.33లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ రవిశంకర్రెడ్డి తెలిపారు. శనివారం వేంపల్లె పంచాయతీ కార్యాలయంలో సంత మార్కెట్, 22 షాపింగ్ గదులకు వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది సంత మార్కెట్కు రూ.30.30లక్షల ఆదాయం వచ్చిందని.. ఈ ఏడాది రూ.2.70 లక్షల ఆదాయం పెరిగిందన్నారు. అలాగే షాపింగ్ గదులకు సంబంధించి 10 శాతం పెంచి ఉన్న వారికే ఇవ్వడం జరిగిందన్నారు. రెండేళ్లలో కరోనా వైరస్ కారణంగా పెద్దగా ఆదాయం లేనందున వారికే ఇవ్వడం జరిగిందని చెప్పారు. సంత మార్కెట్ వేలం పాటలో ముగ్గురు వ్యక్తులు పాల్గొనగా.. కుప్పాలపల్లెకు చెందిన రామగంగిరెడ్డి రూ.33 లక్షలకు వేలం పాట పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, వేలంపాటదారులు పాల్గొన్నారు.

## వెయిట్లిఫ్టింగ్ పోటీల్లో రాణించిన కమలాపురం వాసి



రవిశంకర్ను సత్కరిస్తున్న దృశ్యం

**కమలాపురం :** స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన బీకాం, సెంకడియర్ విద్యార్థి జి.రవిశంకర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాణించాడు. ఈనెల 15 నుంచి 18 వరకు చండీఘడ్లో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించాడు. దీంతో శనివారం స్థానిక ఆ కళాశాలలో వైవీయూ డిప్యూటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య కె.రామసుబ్బారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్ రెడ్డి శాలువ కప్పి సన్మానించారు. కరస్పాండెంట్ రూ.30వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. అత్యుత్తమ క్రీడా ప్రతిభ కనబరిచే విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు తప్పక ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పల్లాకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్లు నరహరి, వినోద్కుమార్లు పాల్గొన్నారు.

## మిక్స్డ్ ఫ్రూట్స్ జామ్ తయారీపై అవగాహన



మిక్స్డ్ ఫ్రూట్స్ జామ్ తయారీ చేస్తున్న కళాశాల విద్యార్థినులు

**పులివెందుల టౌన్ :** పట్టణంలోని ఫుడ్సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు శనివారం లింగాల మండలం అక్కులగారిపల్లె గ్రామంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.ఎస్.బేగ్ ఆధ్వర్యంలో మిక్స్డ్ ఫ్రూట్స్ జామ్ మరియు స్క్వాష్ తయారీ విధానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వయంగా తయారీ చేసిన బొప్పాయి జామ్, పైనాపిల్ స్క్వాష్ తయారు చేసి గ్రామస్తులకు తమ ఇళ్లలో ఎలా సులువుగా తయారు చేసుకునేలా అవగాహన కల్పించారు. పండ్ల ఆధారిత పదార్థాలలో కుటీర పరిశ్రమ ఎలా నెలకొల్పవచ్చునో గ్రామ మహిళలకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయభాస్కర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న సీపీఐ బృందం

**వీరపునాయునిపల్లె :** అకాల వర్షాలకు పంటలు కోల్పోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి డిమాండు చేశారు. శనివారం ఆయన స్థానిక సీపీఐ నాయకులతో కలసి కదిరేపల్లె, తంగేడుపల్లె, యు.రాజుపాలెం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించి మాట్లాడారు. అకాల వర్షాల వలన రైతులు తీవ్రంగా నష్ట పోవడంతో అప్పుల పాలయ్యారని, ఒక్కో ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం అందించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య, సీపీఐ జిల్లా సమితి సభ్యులు బాషా, బ్రహ్మం, షరీఫ్, స్థానిక సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే రవీంద్రనాథ్రెడ్డితో కరచాలనం చేసేందుకు పోటీ పడుతున్న విద్యార్థినులు

**కమలాపురం :** పట్టణంలోని బాలికల హైస్కూల్లో ఉన్న తాగునీటి సమస్యను ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి పరిష్కరించారు. శనివారం బాలికల హైస్కూల్లో నీటి సమస్య ఉందని పలు పత్రికల్లో వచ్చిన కథనాలను చూసి స్పందించిన ఆయన పాఠశాలకు చేరుకున్నారు. నీరు ఎందుకు రావడం లేదని ఇన్చార్జ్ హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. పై అంతస్తులో ట్యాంకులకు నీరు ఎక్కడంలేదన్నారు. ఎమ్మెల్యే ఎస్ఎస్పీఓ అంబవరం ప్రభాకర్రెడ్డితో ఫోన్లో మాట్లాడారు. దాదాపు 400 మంది విద్యార్థులు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారని, రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే పాఠశాల పక్క నుంచే కుప్పారువారిపల్లెకు వెళ్తున్న పైప్లైన్ నుంచి రెండు వాటర్ లైన్ కనెక్షన్లు ఇవ్వాలని స్థానిక నాయకులకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో విద్యార్థులు ఇబ్బంది పడకూడదని వారికి సూచించారు. ఎమ్మెల్యే రాకను చూసిన విద్యార్థులంతా ఎమ్మెల్యేతో కరచాలనం చేసేందుకు పోటీ పడ్డారు. మీకేమైన సమస్యలున్నాయా? అని ఎమ్మెల్యే ప్రశ్నించగా నీటి సమస్య ఉందని పేర్కొన్నారు. రెండు రోజుల్లో మీకు సరిపడా నీళ్లు వస్తాయని చెప్పడంతో విద్యార్థినులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

**చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం**

వేసవి కాలంలో పాదాచారుల, ప్రయాణీకుల దాహార్తిని తీర్చేందుకు దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి పుల్లారెడ్డి జ్ఞాపకార్థం ఆయన మనవడు మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్సీ పుల్లారెడ్డి ఏర్పాటు చేసిన కూల్ మినరల్ వాటర్ చలి వేంద్రాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అలాగే గ్రామచావడి వద్ద మున్సిపల్ సిబ్బంది ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. కాగా ఎమ్మెల్యేనే ఎస్సీ పుల్లారెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సీఎస్ నారాయణరెడ్డి, సుమిత్రా రాజశేఖర్రెడ్డి, మోహన్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.